సాక్షి
వికారాబాద్
గురువారం । 30 । జనవరి । 2025



సాగు సులభం..
తీగజాతి కూరగాయల సాగుకు ప్రస్తుత సీజన్ అనువైనదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో▸



బాల్య వివాహాలు..
బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తాండూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ న్యాయవాదులు అన్నారు. 8లో▸



దుమ్ము లేస్తోంది..!
దుద్యాల్ గేట్ నుంచి మండల కేంద్రం వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అడవులు నరికితే పీడీ యాక్ట్
ఎఫ్ఆర్ఓ రాజేందర్



అటవీ ప్రాంతం ఆక్రమణకు గురికావడంతో అధికారులు తవ్వించిన కందకాలు

యాలాల/ధారూరు: అటవీ ప్రాంతంలో చెట్లను నరికితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజేందర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని రాస్నం అటవీ ప్రాంతంలో కొంత మంది రాళ్లు తొలగించి, అటవీ హద్దులు మూసివేసి దారి ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఆ దారిలో కందకాలు తవ్వి మూసివేసినట్లు పేర్కొన్నారు. అడవులను నరికినా, జంతువుల ఆవాసాలకు ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రాస్నం సెక్షన్ ఆఫీసర్ కనకరాజు ఉన్నారు.

అతివేగం ప్రమాదకరం
ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్



సమావేశంలో మాట్లాడుతున్న జాఫర్

అనంతగిరి: అతివేగం ప్రమాదకరమని, వాహన చోదకులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్ల ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతోనే చాలా మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. ఏది కోల్పోయిన తిరిగి పొందగలం.. కానీ ప్రాణం పోతే పొందలేమని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల బారిన పడి దాదాపు రెండు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వీటిని తగ్గించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్లు ఇతర వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. పాదచారులు రోడ్డుపై జాగ్రత్తగా నడవాలన్నారు. దాదాపు వంద మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ జోసెఫ్ హాల్ట్, ఏఎంవీఐలు కిషోర్, శ్రీలక్ష్మి, వరుణ్ కుమార్, రజని, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ యాదవ్, కానిస్టేబుళ్లు రాఘవేంద్ర, ప్రియాంక గౌడ్, సిబ్బంది, మహావీర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలు టార్గెట్ పూర్తి చేయండి
అడిషనల్ కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి, అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులు, ఇన్‌చార్జులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రోజువారి పారిశుద్ధ్య పనులను యథావిధిగా కొనసాగించాలన్నారు. ఎక్కడా ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పన్నులు వసూలును వేగవంతం చేసి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. అందుకు గాను ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లీలావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాలయాల్లో, సైనిక్, ఫైన్ ఆర్ట్స్ స్కూల్స్‌లో ఐదు నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు పొందేందుకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 9704550233లో సంప్రదించాలన్నారు.

‘అనంత’ పర్యాటకం

- టూరిజంపై కదలిక
- అనంతగిరి అభివృద్ధికి రూ.1,000 కోట్లతో ఎంఓయూ
- టెండర్లకు సిద్ధమవుతున్న అధికారులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రణాళిక



అనంతగిరి కొండలు

వికారాబాద్: జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న అనంతగిరి కొండలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసే విషయంలో మళ్లీ కదలిక వచ్చింది. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా అభివృద్ధి చేయాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించగా తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో రాష్ట్ర అభివృద్ధి కోసం పెట్టుబడులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఇందులో మెఘా సంస్థ రూ.1,000 కోట్ల పెట్టుబడులతో అనంతగిరిని అభివృద్ధి చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ వెల్లడించారు. గతంలో ఆశించినదానికంటే కూడా ఎక్కువ అభివృద్ధి జరిగే అవకాశం కనిపిస్తోంది. డీపీఆర్ తయారీ బాధ్యతలు ఎల్అండ్‌టీ సంస్థకు అప్పగించిన విషయం తెలిసిందే. వారు సమర్పించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఆధారంగా పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవనున్నారు. 213 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి పనులకు రూ.110 కోట్లు ఖర్చవుతుందని గతంలో అంచనా వేశారు. ప్రస్తుతం మెఘా సంస్థతో రూ.1,000 కోట్ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో అభివృద్ధి మరింత విస్తరించనుంది. మొదటి విడతగా రూ.33 కోట్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే అనంతగిరి కొండలు, అటవీ ప్రాంతం, సర్పన్‌పల్లి ప్రాజెక్టు, కోట్‌పల్లి ప్రాజెక్టులకు మరింత పర్యాటక శోభ సంతరించుకుంటుంది. అనంతగిరి పర్యాటక అభివృద్ధిలో భాగంగా సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టులకు సైతం ప్రణాళికలు తయారు చేశారు.

ఇప్పటికే స్వదేశీ దర్శన్‌లో ఎంపిక

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వదేశీ దర్శన్ పథకం రెండో విడత జాబితాలో అనంతగిరి, యాదాద్రి జిల్లా పరిధిలోని భువనగిరి కొండ ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే ఎల్అండ్‌టీ సంస్థ మాస్టర్ ప్లాన్, ప్రాజెక్టు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో టెండర్లకు సిద్ధమవుతున్నారు.

అడ్వెంచర్, టూరిజం స్పాట్‌గా..

సాధారణంగా పర్యాటక కేంద్రాలను రెండు రకాలుగా అభివృద్ధి చేస్తారు. ఇందులో ఒకటి సాధారణ పర్యాటక అభివృద్ధి.. ఇందులో అడవుల అందాలు వీక్షించడం, ఆలయాల సందర్శన తదితర అంశాల ఉంటాయి.. రెండోది అడ్వెంచర్ టూరిజం(సాహస పర్యాటకం)అభివృద్ధి.. ఇందులో ప్రధానంగా యువత ఇష్టపడే సాహస కృత్యాలకు దోహదపడేలా టూరిజాన్ని తీర్చిదిద్దుతారు. ట్రెక్కింగ్, రోప్‌వే తదితర వాటిని అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం అనంతగిరి కొండలను ఈ రెండు కలగలిపి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న ఈ ప్రదేశం పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. అయితే పర్యావరణం, చెట్లు, పక్షి, జంతుజాతుల జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అభివృద్ధి చేయనున్నారు.

ఎన్నో అనుకూల అంశాలు



అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రూ.1,000 కోట్లు పెట్టుబడులు పెట్టేలా మెఘా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతగిరి గుట్టకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అనేక అనుకూల అంశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకుని ముందుకు వెళ్తాం. రాష్ట్ర రాజధానికి ఈ ప్రాంతం 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. రోడ్డును విస్తరిస్తే నగరవాసులు గంటలో ఇక్కడికి చేరుకుంటారు. రీజనల్ రింగ్ రోడ్డు పూర్తయితే ఆ రోడ్డు నుంచి 15 నిమిషాల్లో ఇక్కడికి చేరుకోవచ్చు. అభివృద్ధి పనులు పూర్తయితే పర్యాటకుల తాకిడి పెరుగుతుంది.

– గడ్డం ప్రసాద్‌కుమార్, స్పీకర్

రోజుకు 5వేల మంది పర్యాటకులు వచ్చేలా.. వెయ్యి మంది ఇక్కడే బస చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రాజెక్టు పూర్తయితే దాదాపు వెయ్యి మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

పేదలకే సంక్షేమ ఫలాలు

ఇబ్రహీంపట్నం: ‘ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకే దక్కాలి.. వీటిని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే.. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు’అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఏడు పథకాలపై వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి వివిధ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాల లబ్ధిదారుల ఎంపికతోపాటు సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, ఈజీఎస్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఆయా పథకాల అర్హుల జాబితాను రూపొందించడం సులువుగా మారుతుందన్నారు. సమావేశంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

మా భూముల జోలికి రావొద్దు

- పారిశ్రామికవాడకు భూములివ్వమని తేల్చి చెప్పిన రోటిబండ తండా, పులిచర్లకుంట తండా రైతులు
- సానుకూలంగా స్పందించిన లగచర్ల వాసులు
- రేపటి నుంచి సర్వే ప్రక్రియను ప్రారంభిస్తాం: తహసీల్దార్ కిషన్
- పోలీసుల పహారాలో ప్రజాభిప్రాయ సేకరణ

దుద్యాల్: మండలంలో పారిశ్రామికవాడ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. బుధవారం లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల రైతులతో తహసీల్దార్ కిషన్ విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు గురించి తెలియజేశారు. ఇందుకు గాను ఆయా గ్రామాల్లోని అసైన్డ్ భూముల్లో ఈ నెల 31 నుంచి సర్వే నిర్వహించనున్నట్లు వివరించారు. లగచర్ల గ్రామ సర్వే నంబర్ 102లో 43 మంది రైతులకు చెందిన 47.25 ఎకరాల భూమి, రోటిబండ తండా సర్వే నంబర్ 102లో 30 మంది రైతులకు చెందిన 22 ఎకరాల భూమి, పులిచర్లకుంట తండా సర్వే నంబర్ల 117, 120, 121లోని 20 మంది రైతులకు చెందిన 40.15 ఎకరాల భూమికి సంబంధించి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో 110 ఎకరాల అసైన్డ్ భూములకు హద్దులు గుర్తిస్తామన్నారు. ఇందుకు లగచర్ల రైతులు సానుకూలంగా స్పందించడంతో సమావేశం సాఫీగా ముగిసింది. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెనక్కు తగ్గని ఆ రెండు తండాలు

రోటిబండ తండా, పులిచర్లకుంట తండా రైతులతో రోటిబండ తండాలో తహసీల్దార్ కిషన్ సమావేశం నిర్వహించారు. పారిశ్రామిక వాడకు అసైన్డ్ భూములు ఇవ్వాలని, త్వరలో సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ తెలియజేశారు. దీంతో గిరిజనులు ఆగ్రహానికి గురయ్యారు. మాకు ఉన్న కొద్ది పాటి భూమిని మీకు ఇస్తే మా పిల్లలకు ఏం ఇవ్వాలని నిలదీశారు. రోటిబండ తండాలో కేవలం 22 ఎకరాల అసైన్డ్ భూమి మాత్రమే ఉందని తెలిపారు. గ్రామానికి పాఠశాల మంజూరైందని, ఆంజనేయస్వామి, తుల్జ భవాని, సేవాలాల్ ఆలయాల నిర్మాణానికి అసైన్డ్ భూమి సరిపోతుందని గిరిజనులు అధికారులకు వివరించారు. ఈ కారణంగానే తాము భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేదని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ మీ నిర్ణయాన్ని అన్నతాధికారులకు వివరిస్తానని హామీ ఇచ్చారు. ముందు సర్వేకు సహకరించాలని కోరారు. ఇందుకు వారు ససేమిరా అన్నారు. సారూ.. మా భూముల జోలికి రావొద్దని గిరిజన మహిళలు అధికారుల కాళ్లపై వేడుకున్నారు. రెండు తండాలకు చెందిన రైతులు మరో మారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడతామని అధికారులు తెలిపారు.

భారీ బందోబస్తు మధ్య సమావేశాలు

గత ఏడాది లగచర్ల గ్రామంలో అధికారులపై దాడి ఘటన నేపథ్యంలో బుధవారం లగచర్ల, రోటిబండ తండాల్లో నిర్వహించిన రైతుల సమావేశానికి దాదాపు 100 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. కొడంగల్, పరిగి సీఐలు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దుద్యాల్, బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ ఎస్ఐలు భరత్‌రెడ్డి, సత్యశీలరెడ్డి, అబ్దుల్ రవూఫ్, సత్యనారాయణ, రవి గౌడ్ పాల్గొన్నారు.



రోటిబండ తండా రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

సంక్షేమ సంబురం

- పోలేపల్లిలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఆమనగల్లు: ప్రభుత్వం జనవరి 26 ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను మండలానికి ఓ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులకు అందజేస్తున్నారు. మండల పరిధిలోని పోలేపల్లిలో 122 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 160 మందికి రేషన్ కార్డులు, 11 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 1,157 మందికి రైతు భరోసా అందజేశారు. పోలేపల్లి గేటు నుంచి మంగళికుంట తండాకు వరకు రోడ్డు మరమ్మతుకు రూ.కోటి మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్‌రెడ్డి, నాయకులు అంజన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, జంగయ్య, శేఖర్, శ్రీశైలం, కొండల్, జగన్, రవి, జంగయ్య, ఈదమయ్య పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో రాణించాలి

- రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు

యాచారం: పారా అథ్లెటిక్స్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థి అక్షితను జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అభినందించారు. బుధవారం ఆమె డీఈఓకు తాను సాధించిన బంగారు పతకాలను చూపింది. అనంతరం సుశీందర్‌రావు అక్షితను శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. విద్యాశాఖ నుంచి తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల హెచ్ఎం నర్సింహ, పీడీ మల్లేష్ ఉన్నారు.



అక్షితను సన్మానిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

ప్రజల్ని మభ్యపెట్టేందుకే ‘గ్యారంటీలు’

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రజల్ని మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ లేని పథకాలను ప్రచారం చేసుకుంటోందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసిన అనంతరం మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు దగ్గర పడుతున్నందున ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఇప్పటికైనా అర్హులకు పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇటీవల నియోజకవర్గంలోని చంద్రవంచ సభలో సీఎం హామీ ఇచ్చి మాట మార్చిన తీరు తన వైఖరి ఏమిటో అందరికీ తెలిసిపోయిందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులపై ప్రజలు తిరగబడటం ఖాయమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పా చేసిందేమీ లేదన్నారు. ఇచ్చిన హామీన్నీ వెంటనే నెరవేర్చాలన్నారు. విద్యార్థులకు స్కూటీలు, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, మహాలక్ష్మి, నిరుద్యోగులకు, దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి, శేరి నారాయణరెడ్డి, దేశ్యానాయక్, నెహ్రూనాయక్, హీర్యానాయక్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

ధర.. దగా..!

- పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డులో టెండరుదారుల రింగ్
- రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వైనం
- క్వింటాలుకు రూ.5 వేలకు పడిపోయిన ధరలు



పరిగి మార్కెట్ యార్డులో బీట్లు చేస్తున్న టెండరుదారులు

పరిగి: పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డులో టెండరుదారులు చెప్పిందే ధర అన్నట్లు తయారైంది. గతంలో ఎప్పుడూ లేనంతగా వేరుశనగ ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు రింగ్‌గా ఏర్పడి ధరలు తగ్గించేశారు. రైతులు తెచ్చిన వేరుశనగ పంటను చిన్న కుప్పగా పోసి దాని నాణ్యత ఆధారంగా పంట మొత్తానికి ధర లెక్కిస్తున్నారు. కొంత మంది రైతులకు క్వింటాలుకు రూ.6 వేలు వేసి.. మిగతా రైతులకు క్వింటాలుకు రూ.4 వేలు నుంచి రూ.5 వేల వరకు ధరలు వేసి మోసానికి పాల్పడుతున్నారు. టెండరుదారులు సిండికేట్‌గా ఏర్పడి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు తెలిపారు. తాము ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే దళారులు ఒక్కరోజు వ్యాపారం చేసి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు.

మద్దతు ధర రూ.6,700

ప్రభుత్వం క్వింటాలు వేరుశనగ పంటకు రూ.6,700 మద్దతు ధర చెల్లించాలని ఆదేశిస్తే దళారులు, టెండర్‌దారులు కేవలం రూ.4,500 నుంచి రూ.5వేలు ఇస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటాలుకు ఏకంగా రూ. 2వేల వరకు నష్టపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అక్రమాలకు ఆస్కారం లేదు

మార్కెట్‌లో ఎలాంటి అవకతవకలు జరగడం లేదు. రైతుల ఎదుటే బీట్లు నిర్వహించి ధర నిర్ణయిస్తున్నాం. తూకం, ధరలో ఎలాంటి వ్యత్యాసం లేదు. నాణ్యతను బట్టి ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. అది కూడా రూ.100 నుంచి రూ.200ల లోపే. ఎగుమతులను బట్టి వ్యాపారులు రేట్లు నిర్ణయిస్తున్నారు.

– విజయ్‌కిషోర్, పరిగి మార్కెట్ కమిటీ కార్యదర్శి

కాంగ్రెస్, బీఆర్ఎస్.. బొమ్మాబొరుసు

- హామీల అమలులో రెండు పార్టీలు విఫలం
- రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్



బీజేపీ జెండా ఆవిష్కరణలో ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బీఆర్ఎస్ మాదిరిగానే హామీల అమలులో విఫలమైందని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జెండా పండుగతో బీజేపీ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటామని చాటి చెబుతున్నామన్నారు. పదేళ్ల మోదీ పాలనలో సంక్షేమ పథకాలు ప్రారంభించారని.. దళారీ వ్యవస్థ లేకుండా రూ.25లక్షల కోట్ల ఆదాయం పేదలు, రైతుల అకౌంట్లలో జమ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. మాటలతో పబ్బం గడుపుతున్నాడన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ రాబోతుందన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని.. బీజేపీ పాలనలో రైతులకు, యువతకు, ప్రజలకు ప్రణాళిక ప్రకారం ఏమి చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తామన్నారు. ఈ జెండా కార్యక్రమాలతో ప్రజలకు బీజేపీ ఉందనే భరోసాను కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలపడంతో పాటు ప్రతిపక్షాల ఆరోపణలకు సమాధానాలు చెబుతామన్నారు.

ఏడు స్థానాల్లో గెలుస్తాం: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ చిత్తశుద్ధితో పనిచేసే పార్టీ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ హామీని నెరవేరుస్తూ దేశాన్ని అభివృద్ధి చేసుకుంటూ వెళ్తోందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కై వసం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్ రెడ్డి, కేఎస్.రత్నం, రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

దౌల్తాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తాండూరు సబ్‌కలెక్టరు ఉమాశంకర్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ముందుగా పాఠశాలలో రికార్డులు, హాజరుపట్టిక, స్టోర్‌రూంను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు'కు ఆహ్వానం



మాజీ మంత్రి చంద్రశేఖర్‌తో మంద కృష్ణమాదిగ

అనంతగిరి: హైదరాబాద్‌లో వచ్చే నెల 7న నిర్వహించే 'వేయి గొంతులు–లక్ష డప్పులు' కార్యక్రమానికి రావాలని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ మాజీ మంత్రి డాక్టర్. ఏ.చంద్రశేఖర్‌ను ఆహ్వానించారు. బుధవారం నగరంలోని మాజీ మంత్రి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా ఇటీవల మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంతో శాలువాతో సన్మానించారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

ఎక్సైజ్ సీఐ రాగవీణ



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

అనంతగిరి: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాగవీణ కోరారు. ఈ మేరకు బుధవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు ఈ వయసులో కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించడంతో అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. ఎక్కడైన మత్తుపదార్థాలు సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, శివరాంరెడ్డి, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల గొడవ

కేసు నమోదు

కేశంపేట: పాఠశాలలో కలిసి చదువుకున్న స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ బాలుడిపై కేసు నమోదైంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంతాపూర్‌కు చెందిన మద్దు సందీప్ మంగళవారం సాయంత్రం తన అమ్మమ్మ వారి గ్రామమైన కొత్తపేటకు వెళ్లాడు. తనతో కలిసి చదువుకున్న మిత్రులు అభిషేక్, నవీన్, భాను ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్నారని తెలుసుకుని, కలిసేందుకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత అభిషేక్, సందీప్ మధ్య గొడవ మొదలైంది. దీంతో సందీప్ అక్కడి నుంచి వెళ్లిపోతుండగా అభిషేక్ పరుష పదజాలంతో తిడుతూ రాడ్‌తో తనపై దాడి చేశాడని సందీప్ తెలిపాడు. దీంతో మంగళవారం రాత్రి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఆశావహుల జేబుకు చిల్లు!

- పల్లె పోరులో ఏర్పడిన జాప్యంతో అవస్థలు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు
- నిత్యం దావత్‌లతో తడిసి మోపెడు



దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దుద్యాల్: గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు ప్రక్రియ డైలీ సీరియల్ మాదిరి సాగుతూ వస్తోంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల్లో కలవరపాటు మొదలైంది. ప్రభుత్వం పల్లె పోరును దసరా పండుగ తర్వాత నిర్వహిస్తామని తెలిపి, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలతో సంక్రాంతికి జరిపింది. ప్రస్తుతం అధికార యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సైతం చేసింది. గతేడాది జనవరి 31న గ్రామపంచాయతీల పాలకవర్గం పదవీకాలం ముగిసింది. అయినా నేటికీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకపోవడం గమనార్హం. మరోపక్క ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు నానా అగచాట్లు పడుతున్నారు. నిత్యం దావత్‌ల పేరుతో ఖర్చు తడిసి మోపెడవుతుందని వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 585 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో సర్పంచ్ పదవికి పోటీ చేసే వారి సంఖ్య గణనీయంగానే ఉందని ప్రాథమిక అంచనా.

గ్రూప్ రాజకీయలతో పరేషాన్

కొడంగల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు పోటీ పడుతున్నారు. అందుకు అనుగుణంగానే వర్గాలుగా ఏర్పడ్డారు. అదిగో.. ఇదిగో ఎన్నికలంటూ ప్రభుత్వ ప్రకటనలతో గ్రామాల్లో వేడెక్కిన వాతావరణం.. ఒక్కసారిగా స్తబ్ధుగా మారింది. దుద్యాల మండల కేంద్రంతో పాటు హస్నాబాద్, హకీంపేట్, కుదురుమల్ల, హకీంపేట, పోలేపల్లి, లగచర్ల, ఈర్లపల్లి, చిలుముల మైల్వార్, హంసంపల్లి వంటి పెద్ద గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు రెండు నుంచి మూడు వర్గాలుగా విడిపోయి లాబింగ్‌లు మొదలుపెట్టారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు నడిపించిన నాయకులు ఒక వర్గంగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ పెద్దల హామీలతో కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు మరోవర్గంగా ఏర్పడి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక కాలనీలో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ మనకే టికెట్ అంటూ ప్రచారాలు మొదలు పెట్టారు. గ్రామాన్ని సక్రమంగా పాలించే మంచి నాయకుడు పోటీలో ఉంటే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తం అవుతుంది.

ఇక నువ్వే సర్పంచ్..

గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేయడానికి సిద్ధపడుతున్న ఆశావహులు కొన్ని నెలలుగా మద్దతుదారులను వెంటపెట్టుకుని స్థానికంగా హల్‌చల్ సృష్టిస్తున్నారు. మధ్యాహ్నం వెంట తిరగడం.. రాత్రికి మద్యం తాగడం వంటి కార్యక్రమాలు పల్లెల్లో జోరుగా సాగుతున్నాయి. 'ఇక నువ్వే సర్పంచ్‌వి.. నీకు తిరుగు లేదు' అంటూ పొగడ్తలతో ఆశావహులను ఆకాశానికి ఎత్తి జేబులు ఖాళీ చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఇంకా ముందుకు పోతే మాత్రం ఆశావహులు అప్పుల పాలు కావల్సిందే అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ప్రభుత్వం పల్లె పోరు ఎప్పుడు నిర్వహిస్తోందో వేచి చూడాలి.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది జిలాని

తాండూరు టౌన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తాండూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ న్యాయవాదులు జిలాని, వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం పట్టణ శివారులోని టీజీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. ఇందుకు తల్లిదండ్రులు, సహకరించిన వారికి 2006 బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం జైలుశిక్ష పడుతుందన్నారు. మైనర్‌లను వివాహం చేసుకునే వారికి సైతం రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా ఉంటుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి చట్టాలపై, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగికంగా ఇబ్బందులకు గురైనట్‌లెతై వెంటనే ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్‌లను లైంగికంగా వేధించిన వారిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తారన్నారు. విద్యార్థులు తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం కూడా చట్ట ప్రకారం నేరమన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ఎస్పీని ఆశ్రయించిన రైతులు



వివరాలు వెల్లడిస్తున్న బాధిత రైతులు

పూడూరు: రియల్ వ్యాపారులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై తమ వ్యవసాయ భూములను పట్టా మార్పిడి చేయడమేకాకుండా, అక్రమ కేసులు బనాయించారని పలువురు రైతులు బుధవారం ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈఅంశంలో తమకు న్యాయం చేయాలని బాధితులు అంజయ్య, మల్లేశం, వినోద్, బుచ్చమ్మ, గఫార్‌ఖాన్, నూర్జహాన్‌బేగం, ఇమ్రాన్‌ఖాన్ ఎస్పీని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూడూరు మండలం చన్గోముల్ రెవెన్యూ పరిధిలోని 496 సర్వే నంబర్‌లో ఉన్న తమ 10.22 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి గగన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్‌తో కుమ్మక్కై తన పేరున మార్చుకున్నాడని తెలిపారు. ఈ విషయమై తాము తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నిలదీయగా.. గగన్‌రెడ్డి పేరుపై మారిన భూమిని తిరిగి తమపేర్లపైకి మారుస్తామని డీటీ హామీ ఇచ్చాడన్నారు. ఈ మేరకు 10.22 ఎకరాల భూమిని తమపై జీపీఏ చేశారని వివరించారు. అయితే తన ప్రమేయం లేకుండా జీపీఏ చేయడంతో గగన్‌రెడ్డి తమపై చీటింగ్ కేసు నమోదు చేయించారన్నారు. ఈ విషయమై పరిగి డీఎస్పీ, సీఐ, చన్గోముల్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేశామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో నాయకులు యాదవరెడ్డి, రహీస్‌ఖాన్, షకీల్, చెన్నయ్యగౌడ్, ప్రవీణ్, అమర్‌నాథ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్

తాండూరు టౌన్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నరకమయమవుతుందని తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ అన్నారు. బుధవారం స్థానిక వేదిక్ విశిష్ట పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం, దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడరాదన్నారు. ఏకాగ్రత, పట్టుదలతో కేవలం చదువుపై దృష్టి సారించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకంతో మానసికంగా, శారీరకంగా తీవ్ర దుష్పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నిజాముద్దీన్, సిబ్బంది కృష్ణ, రాజేందర్, భీమయ్య, రమేష్, మహేష్, కిషోర్, సతీష్, పాఠశాల కరస్పాండెంట్ సుహాస్, ప్రిన్సిపాల్ నాగభూషణం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యదర్శిని దుర్భాషలాడిన కేసులో ఇద్దరి రిమాండ్

మోమిన్‌పేట: పంచాయతీ కార్యదర్శిపై దుర్భాషలాడిన వ్యవహారంలో ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ అరవింద్ తెలిపారు. బుధవారం ఈ సంఘటనకు సంబంధించి విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ వెల్లడించారు. మండల పరిధిలోని మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మను అదే గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి, టేకులపల్లి గ్రామానికి చెందిన మానిక్యంలు నోటికి వచ్చినట్లు దుర్భాషలాడినట్లు ఆమె సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీ తమ పట్టా భూమిలో ఉందని సదరు విజయభాస్కర్‌రెడ్డి, మానిక్యం ఆరోపించి, వెంటనే ఖాళీ చేయాలని దుర్భాషలాడారు. కార్యదర్శి స్పందిస్తూ.. ఉన్నతాధికారులకు తెలిపి మరో చోటుకి మారుస్తామని తెలిపినా తిట్ల పురాణం ఆపలేదు. దీంతో ఇందిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎదురెదురుగా బైకుల ఢీ

కేశంపేట: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన బైండ్ల శ్రీకాంత్ శంషాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన విధులకు వెళ్లేందుకు గ్రామం నుంచి శంషాబాద్‌కు వెళ్తుండగా, మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామానికి చెందిన పాపకంటి పరమేశ్ కేశంపేటకు వస్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీకాంత్ కాలికి గాయమవ్వడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

తాండూరు టౌన్: మైనర్లు డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని తాండూరు పట్టణ ఎస్సై రమేష్ అన్నారు. బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా 23 మంది మైనర్‌లు నడుపుతున్న బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండని వారు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం నేరమన్నారు. ఎక్కువగా మైనర్లలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఉన్నారన్నారు. ఒక్కో బైకుపై రూ.1100 జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు. అనంతరం మైనర్ల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లుగా ఉండి బైకులు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురైతే జీవితం నాశనమవుతుందనే విషయాన్ని పిల్లలకు తెలియజేయాలన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సైతం మైనర్ విద్యార్థులు బైకులపై రాకూడదని చెప్పాలన్నారు.

మొగిలిగిద్దను మండలముగా ప్రకటించండి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: చరిత్ర కలిగిన మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవానికి విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాన్ని మండలముగా ప్రకటించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మొగిలిగిద్ద గ్రామాన్ని మండలముగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రస్తుతం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్యమం చేశారన్నారు. మండల ఏర్పాటు ఉద్యమ సమయంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న శంకర్ మాటలకు ఎంతో మంది నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేశారన్నారు. ప్రస్తుతం పాఠశాలకు వేడుకలకు విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దతో పాటు చించోడ్‌ను కూడా మండలముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం రెండు మండలాలు ప్రకటిస్తే ఒక్కో మండల అభివృద్ధి కోసం రూ.కోటి చొప్పున రూ.రెండు కోట్ల చెక్కును అందజేస్తానన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి ఎన్ని కోట్లు ఖర్చు అవుతాయి, ఎంత మంది ఏమి ఆశించి రూ.లక్షల్లో చందాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు రాధాకృష్ణ, గుట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై అదుపు తప్పి ఓ లారీ బోల్తా పడింది. వివరాలు.. యాచారం వైపు నుంచి మాల్‌కు వెళ్తున్న ఓ లారీ బుధవారం ఉదయం యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారును తప్పించబోయి అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులో పడి పోయింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నర్సింహారావు తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిత్తరంజన్‌దాస్



జస్టిస్ చిత్తరంజన్‌దాస్‌కు మొక్కను అందజేస్తున్న ధ్యాన కేంద్రం నిర్వాహకులు

బంట్వారం: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిత్తరంజన్‌దాస్ అన్నారు. బుధవారం ఆయన సతీమణితో కలిసి కోట్‌పల్లి మండలం నాగసాన్‌పల్లి సమీపంలోని క్వాంటం లైఫ్ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ధ్యాన కేంద్రం నిర్వాహకులు, పోలీసులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ధ్యాన కేంద్రంలో కలియ తిరిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ధ్యాన కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ న్యూటన్ కొండవీటి, లక్ష్మి కొండవీటి సేవలను ఆయన ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతిఒక్కరూ ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో లైఫ్ యూనివర్సిటీ ప్రతినిధులు ఆచార్య పవన్, హారిక, నిర్మల, కృష్ణ, వికారాబాద్ జిల్లా కోర్టు ఫీల్డ్ ఆఫీసర్ ఖాజామొహినొద్దీన్, ధారూరు సీఐ రఘురాములు, కోట్‌పల్లి ఎస్సై అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

కద్లాల్: కుక్కల దాడిలో మచ్చల జింక(స్పొటెడ్ డీర్) మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని పిరమిడ్ సమీపాన ఉన్న వ్యవసాయ పొలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి హుస్సేన్‌తో పాటు, అటవీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి– పుల్లేరుబోడ్‌తండా సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి జింక బయటకు రావడంతో కుక్కలు దాడి చేశాయని భావిస్తున్నారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో జింకకు పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల దాడితోనే తీవ్ర గాయాల పాలై మృత్యువాత పడిందని వైద్యుడు తెలిపారు.

సాగు సులభం.. దిగుబడి అధికం

- తీగజాతి కూరగాయల సాగుకు అనువైన సమయమిదే
- సస్యరక్షణతో లాభాలు గడించవచ్చు
- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు



లింగంపల్లిలో సాగవుతున్న బీర పంట

నవాబుపేట: తీగజాతి కూరగాయల సాగుకు ప్రస్తుతం అనువైన సమయమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కాకర, దోస, సొర, గుమ్మడి, బూడిదగుమ్మడి, బీర, దొండ, పొట్లకాయ సాగులో చిన్న చిన్న మెళకువలు, సరైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే అధిక లాభాలు గడించవచ్చని చెబుతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తీగ జాతి కూరగాయలను సాగు చేయడంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలుపుతున్నారు. వీటిని సులభంగా సాగు చేయవచ్చని సూచిస్తున్నారు. సాధారణంగా తీగ జాతి కూరగాయల మొక్కలు తేమతో కూడిన వేడి వాతావరణంలో బాగా పెరుగుతాయి. వీటి సాగుకు తేలికపాటి బంకమట్టి నేలలు అనుకూలం.

కూరగాయల విత్తన రకాలు

సొర: ఆర్కబహర్, పూసా నవీన్, పూసా మంజరి, పూసా సమ్మర్, ప్రొలిఫిక్‌లాంగ్, పూసా ప్రొలిఫిక్ రౌండ్ సంకర రకాల్లో అమిత, శ్రామిక్, వారాద్ అనుకూలమైనవి.

కాకర: కోయంబత్తూర్ గ్రీన్‌లాంగ్, కోయంబత్తూర్ వైట్‌లాంగ్, అర్క హరిత వేసవిలో ఎన్‌ఎస్–437, ఎన్‌ఎస్–432, యూఎస్– 6214, మహికో 13, 15, రేష్మ, అభిషేక్, శ్రేయ, శ్వేత మొదలైనవి.

బీర: జగిత్యాల్ లాంగ్, జైపూర్ లాంగ్, అర్క సుమిత్, గ్రీన్‌బ్యూటీ, అర్క ప్రసన్ వేసవికి సురేఖ, ఎన్‌ఎస్–3, ఎన్‌ఎస్–4, మహిమ, యూఎస్ 6001, నాగా, తానియా–4 రకాలు అనుకూలం.

దొండ: చూపుడు వేలు మందం కాండం ముక్కలు, నాలుగు కణుపులతో కూడి ఉండాలి. దీనిలో సన్న, లావు రకాలుంటాయి.

పొట్ల: ఏపీఏయూ శ్వేత, కో–1, కో–2 రకాలుంటాయి.

బూడిద గుమ్మడి సాగు: ఏపీఏయూశక్తి, కోకో, కేఏయూ, పూసా ఉజ్వల్, కాశీ ఉజ్వ్ రకాలు అనుకూలం.

విత్తన మోతాదు

ఎకరానికి సొర 0.6 నుంచి 0.8 కిలోలు, బీర 0.6 నుంచి 0.8 కిలోలు, కాకర 0.8 నుంచి ఒక కిలో వరకు, పొట్ల 0.6 నుంచి 0.8 కిలోలు, దోస కిలో నుంచి 1.4 కిలోలు, దొండ చూపుడు వేలు మందం కలిగి నాలుగు కణుపులు గల కాండం ముక్కలు 1333 నుంచి 2వేల వరకు అవసరమవుతాయి.

విత్తే దూరం

బీర, కాకర, దోస విత్తనాలను వేసవిలో రెండు వరుసలలో మొక్క మొక్కకు మధ్య దూరం పొడవు 2 మీటర్లు, ఒక వరుసలో మొక్క మొక్కకు మధ్య వెడల్పు 0.5 మీటర్లు ఉండాలి, సొర 2.5మీటర్ల పొడవు, అర మీటరు వెడల్పు ఉండాలి. దొండ, పొట్ల సాగులో పొడవులో 2 మీటర్లు, వెడల్పులో 1–2 మీటర్ల దూరం ఉండాలి.

ఎరువుల యాజమాన్యం

ఎకరానికి 6–8 టన్నుల మాగిన పశువుల ఎరువు లేదా 1.5 టన్నుల వానపాముల ఎరువు మరియు 4కిలోల పాస్ఫో బ్యాక్టీరియా, 4కిలోల అజోస్పైరిల్లమ్‌ను ఆఖరి దుక్కిలో వేయాలి. 32–40 కిలోల భాస్వరం, 16–20కిలోల పొటాష్, 32–40 కిలోల నత్రజనిని ఎకరానికి వేయాలి. భాస్వరం, పొటాష్‌ను పాదులలో వేయాలి. నత్రజనిని రెండు సమ భాగాలుగా చేసుకొని విత్తిన 25–30 రోజుల కోసారి మరియు పూత, పిందె సమయంలో మరోసారి వేయాలి. వేసవిలో ఆడ పూలు ఎక్కువగా వచ్చేందుకు 2–4 ఆకుల దశలో లీటర్ నీటికి 2 గ్రాముల బోరాక్స్‌ను కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

నీటి తడులు

వారానికి ఒకసారి నీటితడి సరిపోతుంది. నేల స్వభావాన్ని బట్టి తడులు అవసరం. నీరు పాదుల్లో నిలువ ఉండకుండా చూడాలి. దోస, గుమ్మడి, బూడిదగుమ్మడి, బీర మొదలకు వాటికి పందిరి అవసరం లేదు. పొట్ల, సొర, కాకరలను పందిరి మీద గాలి పాదుల మీదగాని పాకించాలి. పొట్ల, దొండలకు పందిరి అవసరం.

తెగుళ్ల నివారణకు వేపనూనె



తీగజాతి కూరగాయలకు బూడిద, బూజు, మచ్చ తెగుళ్లు వస్తాయి. పురుగుల నివారణకు వేప నూనె, వేప గింజల కషాయం వాడితే అధిక దిగుబడి సాధించవచ్చు. తెగుళ్లను బట్టి అవసరమైన మోతాదుల్లో మందులను పిచికారీ చేయాలి. వికారాబాద్ డివిజన్ పరిధిలో దాదాపు 200 వందల ఎకరాల్లో తీగ జాతి పంటలు సాగవుతున్నాయి.

– అక్షితరెడ్డి, ఉద్యాన అధికారి, వికారాబాద్

పెద్ద వాహనమొస్తే ఇబ్బందే!

నవాబుపేట: చిన్నగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జితో మండలంలోని ముబారక్‌పూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం మధ్య లోంచి రైల్వే లైను ఉంది. దీంతో లైనుకు ఇవతల కొన్ని, అవతల కొన్ని ఇళ్లు ఉన్నాయి. ఇటుఅటూ రాకపోకలు సాగించడానికి మధ్యలో చిన్న అండర్ బ్రిడ్జి నిర్మించారు. అందులో నుంచి కేవలం ట్రాక్టర్, ఎడ్ల బండి తప్పా పెద్ద వాహనాలు వెళ్లడానికి కుదరదు. స్థానికంగా వ్యవసాయమే ప్రధాన ఆధారం కావడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. కూరగాయల లోడుతో వాహనాలు వెళ్లలేక పోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చిన్నగా ఉన్న రైల్వే బ్రిడ్జిని పెద్దగా నవీకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ముబారక్‌పూర్ వద్ద చిన్నగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి